క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేంపల్లె : స్థానిక 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి ఆర్టీసీ ఫీడర్‌లోని ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి, బాలుర పాఠశాల, ఎ స్సీ కాలనీ, టీటీడీ కల్యాణ మండపం, చైతన్య స్కూల్, కాపువీధి, మైయిన్ బజార్ పంచాయతీ కార్యాలయం, బిడ్డాలమిట్ట ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్‌శాఖ జేఈ శివదినేష్‌కుమార్ తెలిపారు.

భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ

వల్లూరు : మండలంలోని గోటూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని కోర్టు కేసుకు సంబంధించిన భూములను కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్ మంగళవారం పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో భూముల స్థితి గతులను ఆయన పరిశీలించారు. ఆ భూములకు సంబంధించిన రికార్డులను, భూమి మ్యాపులను పరిశీలించి వివరాలను ఆరాతీశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్, ఇతర అధికారులతో ఆ భూములపై సమీక్షించారు. తహసీల్దార్ శ్రీవాణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత



రోడ్లపై గుంతల పూడ్చివేతను పర్యవేక్షిస్తున్న కమిషనర్

కమలాపురం : స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలను కమలాపురం నగర పంచాయతీ కమిషనర్ పగడాల జగన్నాథ్ స్పందించి పూడ్చివేశారు. ఈనెల 24వ తేదీన గుంతలు పూడ్చండి సారూ.. అని సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించి మంగళవారం నగర కమిషనర్ తన సిబ్బందితో ఆర్టీసి బస్టాండు వద్దకు చేరుకుని కంకర డస్ట్ వేసి గుంతలు పూడ్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ మాజీ చైర్మన్ జంపాల నరసింహారెడ్డి, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి

వేంపల్లె : ఉద్యాన పంటల్లో సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని కేవీకే ఉద్యాన శాఖ శాస్త్రవేత్త డాక్టర్ మానస తెలిపారు. మంగళవారం మండలంలోని అలిరెడ్డిపల్లె, ఇడుపులపాయ గ్రామాల్లో వేంపల్లి ఉద్యాన శాఖ అధికారి రెడ్డయ్యతో కలిసి ఆమె మామిడి తోటలను పరిశీలించి మాట్లాడారు. మామిడి తోటల్లో వర్షాల వల్ల శాస్త్రీయ పెరుగుదల ఎక్కువగా కనిపిస్తుంటే దాని నియంత్రణకు సైకో సెల్ ఒకటి లేదా రెండు మిల్లీ లీటర్ల ముందును నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు.

నేడు లక్షార్చన

ఎర్రగుంట్ల : పట్టణంలోని కడప రోడ్డులో వెలసిన అయ్యప్పస్వామి దేవస్థానంలో బుధవారం ఉదయం లక్షార్చాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వహకులు మంగళవారం తెలిపారు. ఆలయంలో ప్రతి ఏడాది కార్తిక మాసంలో అయ్యప్ప భక్తులకు మధ్యాహ్నా, రాత్రి భిక్షను దాతల సహకారంతో నిర్వహిస్తున్నారు. మాలధారణ చేసిన అయ్యప్ప భక్తులందరు తప్పక హజరై లక్షార్చన దీక్షలో కూర్చోవాలని వారు కోరారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

పెండ్లిమర్రి : వర్షాకాలం సీజన్‌లో దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలు దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలని జిల్లా మలేరియా అధికారిని మనోరమ తెలిపారు. మంగళవారం చౌటపల్లెలో కొనసాగుతున్న మెడికల్ క్యాంప్‌ను ఆమె పరిశీలించారు. గ్రామంలో ఇప్పటికి దోమల నివారణకు 180 ఇండ్లల్లో అల్ఫా సైఫర్ నోత్రిన్ ద్రావణం పిచికారి చేయించామన్నారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమతెరలను వాడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వినయ్‌కుమార్‌రెడ్డి, సబ్ యూనిట్ అఫీసర్ మురళి, ఎంపీహెచ్‌ఈఓ రామప్రతాప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

వేంపల్లె : రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలలో వేంపల్లి శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా ఇంగ్లీషు, తెలుగు విభాగాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తమ పాఠశాల విద్యార్థులు ఇంగ్లీష్ విభాగంలో లిఖిత మొదటి బహుమతి, దీక్షిత రెండవ బహుమతి, తనుశ్రీ మూడవ బహుమతి, తెలుగు విభాగంలో ఎస్.పౌర్ణిమ మొదటి బహుమతి, ఎస్.మనోజ్‌కుమార్ రెండవ బహుమతి, దీక్షితరెడ్డి మూడో బహుమతిలు గెలుచుకున్నారన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి



ఆర్టీపీపీలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

పులివెందుల టౌన్ : భారత రాజ్యాంగ దినోత్సవం ఎంతోమందికి ప్రేరణ కలిగిస్తోందని కళాశాల ఆసోసియేట్ డీన్ డాక్టర్ కిశోర్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కళాశాలలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని స్థానిక వైఎస్సార్ సర్కిల్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ సీఎం వైఎస్ జగన్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణుల మధ్య రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని జరుపుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని అతి త్వరలోనే ప్రజలంతా రోడ్లపైకి వచ్చి కూటమి నాయకులకు బుద్ధి చెప్పుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, నూర్‌బాషా ప్రెసిడెంట్ రసూల్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైసీపీ పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఇస్లాంపురం ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెడ్మాస్టర్ బండి సుధాకర్‌రెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు నివాళులర్పించి మాట్లాడారు. స్వాతంత్ర్య అనంతరం అంబేద్కర్ నాయకత్వంలోని ముసాయిదా కమిటీ ప్రపంచంలోని వివిధ రాజ్యాంగాలను సమీక్షించి 1950లో తయారు చేసిన రాజ్యాంగం, ప్రపంచ రాజ్యాంగంలోని విశిష్టమైనదన్నారు. అనంతరం వివిధ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వేంపల్లి అంబేద్కర్ సంక్షేమ సంఘం ప్రతినిధి రామాంజనేయులు, ఎంఈఓ స్టాలిన్, వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు .

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : స్థానిక శ్రీ వివేకానంద హైస్కూల్‌లో మంగళవారం కరస్పాండెంట్ కె.ఖాదర్‌వలి అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించి, రాజ్యాంగం యొక్క విశిష్టతను, ఆవశ్యకతను తెలియజేశారు. విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె. జాఫర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ కుమార్ మంగళవారం అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు లక్ష్మయ్య, అయ్యవార్ మాట్లాడారు.

ఎర్రగుంట్ల..

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో ఆర్టీపీపీ ఇన్‌చార్జి సీఈ దేవేంద్రనాయక్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాలర్పించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీపీపీలోని ఎస్ఈలు, డీఈలు, ఏఈలు యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : సమాజంలో వరకట్నం తీసుకోవడం చట్టరీత్యా నేరం అని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్. భార్గవి తెలిపారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవం, వరకట్నం వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కోర్టులో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించి మాట్లాడారు. ఈ న్యాయవాదులు బి.వి.సుబ్బారావు, పెద్దిరాజు, రవికుమార్, పవన్ కళ్యాణ్, మునీరా పాల్గొన్నారు. అలాగే స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ప్యానల్ న్యాయవాది

వల్లూరు : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ప్యానల్ న్యాయవాదులు రవికుమార్, సుబ్రహ్మణ్యం, నాగ భూషణంలు తెలిపారు. వల్లూరు, పెండ్లిమర్రి, చింతకొమ్మదిన్నె, చెన్నూరు ఎంపీడీవో కార్యాలయాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సహకారంతో మంగళవారం బాల వివాహ ముక్త్ భారత్ ప్రచార కార్యక్రమంలో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించారు. ఇందులో భాగంగా ప్యానల్ న్యాయవాదులు వివాహ వయసు గురించి వివరించారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, బాలికలకు మంచి విద్యను అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదన్నారు. జాతీయ న్యాయ సేవాధికారసంస్థ వారు బాలల సంరక్షణ కొరకు అందిస్తున్న స్నేహ పూర్వక న్యాయ సేవలు పథకం 2015 గురించి వివరించారు. దీని ద్వారా బాలలందరికీ ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. పిల్లల ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యా హక్కు చట్టం, జువైనల్ జస్టిస్ యాక్ట్, పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. పిల్లలు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించి చదివిన సంస్థలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, పారా లీగల్ వలంటరీలు పాల్గొన్నారు.

అబద్ధాలతో గద్దెనెక్కిన చంద్రబాబు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ఎన్నికలలో ప్రజలకు చెప్పిన హామీలను నెరవేర్చకుండా అబద్ధాలతో గద్దెక్కిన చంద్రబాబుపై ప్రజలు మండిపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబెడ్కర్ చిత్రపటానికి నివాలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈ రోజు భారత దేశ చరిత్రలోని గుర్తుండిపోయ్యే రోజు అని అన్నారు. 2024 ఎన్నికలలో సూపర్ సిక్స్ పథకాలు ఆశలు పెట్టి, ఏ వర్గానికి కూడా ఇవ్వలేదన్నారు. కానీ నిత్యం ప్రతిపక్షనేత వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాడన్నారు. ఆశపడి ఓటు వేసిన వారిని కూడా పట్టించుకోలేదన్నారు. 50 ఏళ్లకు పింఛన్ అన్నాడు అదికూడా అమలు చేయలేదన్నారు. 2029 ఎన్నికల్లో చంద్రబాబుకు డిపాజిట్లు కూడా రావన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, ఉపమండలాధ్యక్షుడు మల్లు మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై శిక్షణ

తొండూరు : మండలంలోని ఐదు నీటి సంఘాలకు సంబంధించిన ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రామచంద్రుడు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు, మండలాధికారులకు ప్రత్యేక శిక్షణా తరగతులను ఆయన నిర్వహించి మాట్లాడారు. అన్ని గ్రామాల్లో ఉన్న రైతుల ఓటర్ల జాబితాలను స్థానిక రెవెన్యూ సిబ్బంది సహకారంతో ఇప్పటికే సిద్ధం చేశామన్నారు. మండలంలో తొండూరు, ఇనగలూరు, అగడూరు, సైదాపురం, మదూరులకు సంబంధించి నీటి సంఘాలు ఉన్నాయని.. వాటి పరిధిలోని రైతుల వివరాలను సేకరించామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులకు ఎటువంటి సందేశాలు ఉన్నా గ్రామస్థాయిలో ఉన్న రెవెన్యూ సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మధుసూదన్‌రెడ్డి, ఏపీఎం వెంకటనారాయణ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

పులివెందుల టౌన్ : విద్యార్థులందరూ క్రమశిక్షణతో మెలిగి అనుకున్న లక్ష్యాలను సాధించాలని కళాశాల కళాశాలల ఆర్‌జేడీ గిరి తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాలల రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్.డి.గిరి మాట్లాడుతూ మహిళా సాధికారత, మహిళల విద్య ఆవశ్యకతను వివరిస్తూ, వివిధ రంగాలలో నిష్ణాతులైన మహిళలను ఉదాహరిస్తూ, విద్యార్థినిల భవిష్యత్తు తీర్చిదిద్దుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అలాగే ఆర్‌జేడీ గిరిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ సుధీర, అధ్యాపకులు పాల్గొన్నారు.

శనగలో వేరుకుళ్లు వ్యాప్తిపై జాగ్రత్త వహించాలి

ముద్దనూరు : శనగ పంటలో వేరుకుళ్లు తెగులు వ్యాప్తిపై రైతులు ఆందోళన చెందకుండా తగిన జాగ్రత్తలు పాటించి దాని నివారణపై శ్రద్ధ వహించాలని కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగపు శాస్త్రవేత్త సాయిమహేశ్వరి సూచించారు. మంగళవారం ఆమె స్థానిక డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య, ఏవో వెంకటకృష్ణారెడ్డితో కలసి మండలంలోని వేల్పుచెర్ల, పెద్దదుద్యాల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ వేరుకుళ్లు సోకిన శనగ పంటకు 2 మి.లీ.హెక్సాకొనజోల్ లేదా1 మి.లీ. ప్రొపికోనాజోల్ లేదా 1 మి.లీ.టెబునోకొనజల్‌లో ఏదో ఒకదానిని నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటలు తడవకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మండల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశారు

వేంపల్లె : మండల అభివృద్ధే లక్ష్యంగా జడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి పనిచేశారని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. స్థానిక వైఎస్ఆర్ సభా భవనంలో మంగళవారం ఎం.రవికుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీటీసీ పద్మారెడ్డి జయలక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పద్మారెడ్డి రాజ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు భారతీ, బాబాషరీఫ్, ఎంహెచ్ హబిబుల్లా, కో ఆప్షన్ సభ్యుడు అస్సానయ్య, వార్డు సభ్యుడు ముత్యాల అంజి, వైఎస్సార్‌సీపీ నేతలు నిషార్‌బాషా, కమతంరాజా, రామ్మోహన్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

పెద్దముడియం : 2024–25 సంవత్సరానికి సంబంధించి రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అరుణ తెలిపారు. ఈ పథకం కింద ఎకరాకు శనగ రూ.480, మినుము రూ.285, పెసర రూ.270, నువ్వులు రూ.180, వేరు శనగ రూ.480, జొన్న రూ.315, ప్రొద్దుతిరుగుడు రూ.300, వరి రూ.630 ప్రీమియం చెల్లించాలని తెలిపారు. పొలం పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలు, రైతు సేవా కేంద్రం నుంచి పంటలు సాగు చేసినట్లు ధ్రువపత్రం, ఆధార్ లింక్ అయిన సెల్ నెంబర్ తదితర వివరాలు అందజేయాలన్నారు. వచ్చే నెల 15వ తేదీ లోపు గ్రామ సచివాలయం, మీ సేవ, కామన్ సర్వీస్ సెంటర్లు, పోస్టాఫీసుల్లో ప్రీమియం చెల్లించాలని తెలిపారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించండి



మాట్లాడుతున్న ఏఓ సరస్వతి

కమలాపురం : మండలంలో పంటలు సాగు చేసిన రైతులు డిసెంబర్ 15వ తేదీలోపు తమ పంటలకు సంబంధించి బీమా ప్రీమియం చెల్లించాలని ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లె, వంకమాడ గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె కంది, మినుము, శనగ, ఉలవ పంటలను పరిశీలించారు. పంటలకు ఆశించిన తెగుళ్లను, వాటి నివారణలను రైతులకు వివరించారు. పంటల బీమాను దరఖాస్తు చేసుకోవడానికి వన్‌బీ, అడంగల్, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్‌తో పాటు పంటల ధృవీకరణ పత్రం ఆయా రైతు సేవా కేంద్రాలలో వీఏఏల ద్వారా తీసుకుని సీఎస్‌సీ సెంటర్స్ నందు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ బాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోని, గంగాదేవి, రైతులు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : అరటిలో తెగుళ్లు నివారిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఉద్యాన శాఖాధికారి రాఘవేంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం వేములలో ఏఓ చెన్నారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అరటి పంటలో సిగటోకా తెగులు ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. అలాగే గెల వేయని అరటి చెట్లకు, గెల వేయని అరటి చెట్లకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం వర్షాల తర్వాత యూరియా, పోటాష్ లను డ్రిప్ ద్వారా పంపించాలన్నారు. వ్యవసాయ అసిస్టెంట్ హారిక, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : శనగ పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏఓ రమేష్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని దొండ్లవాగు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై రైతులతో కలిసి శనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయధికారి మాట్లాడుతూ శనగ పంటలో పురుగు ఉధృతి, వేరుకుళ్ళు తెగులు ఆశించినట్లు గుర్తించడం జరిగిందని.. వీటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

కొండాపురంలో

కొండాపురం : మండలంలోని రేగడిపల్లెలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎఓ రామంజులరెడ్డి పాల్గొని మాట్లాడారు. శనగపంట విత్తన సమయంలో పొలంలో పంట చుట్టు నాలుగు సార్లు జొన్న విత్తుకోవడంవల్ల రసం పీల్చు పురుగుల ఉధృతిని అరిక్టవచ్చునన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కె.సాయిమహేశ్వరి, ఉప మండలాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : మండలంలోని బుగ్గలపల్లె, రాజులతాతయ్యగారిపల్లెల్లో మంగళవారం వ్యవసాయ అధికారులు నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమాల్లో మండల వ్యవసాయ అధికారి ఈశ్వర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. హార్టికల్చర్ అసిస్టెంట్లు శిల్ప, రేఖ, రైతులు పాల్గొన్నారు

ఆడపిల్లలను చదివిద్దాం.. రక్షిద్దాం



కమలాపురంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి



వేంపల్లెలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కుళ్లాయమ్మ



పులివెందులలో మాట్లాడుతున్న ఎంఈఓ రామానాయుడు

కమలాపురం : ఆడపిల్లలను చదివించండి.. ఆడ పిల్లలను రక్షించండి.. అని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో కిశోరి వికాసం అనే కార్యక్రమంపై వివిధ శాఖల క్షేత్ర స్థాయి సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల పై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అలాగని పూర్తిగా భయపడే స్థితిలో పెంచరాదన్నారు. సమాజంలో ఎలా మెల గాలో వివరిస్తూ పెంచాలన్నారు. ఆడపిల్ల అబల కాదు.. సబల అనేలా అమ్మాయిలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, పెద్దచెప్పలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జావలి ప్రసూన, బీపీఎం శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : స్థానిక రైతు భరోసా కేంద్రంలో కిశోరి వికాసం సందర్భంగా అధికారులకు, సిబ్బందికి అంగన్‌వాడీ సూపర్ వైజర్ రమణమ్మ నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఆరిఫుల్లా మాట్లాడారు. కిశోరి వికాసం పునఃప్రారంభం రాష్ట్రంలోని ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగుపరచడానికి ఓ మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణుప్రసాద్, ఏపీఎం వెంకటనారాయణ, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సాయిప్రతాప్‌రెడ్డి, సీసీలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక వైఎస్ఆర్ సభా భవనంలో కిశోరి వికాసంపై గ్రామస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య సిబ్బందికి ఎంపీడీఓ కుళాయమ్మ నిర్వహించి మాట్లాడారు. బాల్య వివాహాలపై అంగన్‌వాడీలు, ఆశా, ఏఎన్ఎం సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఇఓ స్టాలిన్ ఐజాక్, ఎస్ఐ తిరుపాల్ నాయక్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ స్వర్ణలత, హెల్త్ సూపర్ వైజర్ వెంకటరత్నం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో మంగళవారం ఎంపీడీఓ అధ్యక్షతన కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సీడీపీఓ శ్రీలత, ఎంఈఓ రామానాయుడు, ఏపీఎం గురురాజు, ఎంపీహెచ్‌ఈఓ సతీష్‌లు హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబున్ని, శిక్షకురాలు నాగేశ్వరి, హెడ్మాస్టర్ వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : స్థానిక సభాభవనంలో ఎంపీడీఓ కుల్లాయిబాబు కిశోరి వికాసంపై మండలస్థాయి శిక్షకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఆడపిల్లలకు ప్రథమ గురువు తల్లి అని వారి ఆలనా పాలనా తల్లికి బాధ్యత ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంఈఓ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : బాల్య వివాహాలను అరికట్టి బాలికలను సంరక్షించుకుందామని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభ భవనంలో అంగన్‌వాడీ, ఆశా, ఏఎన్ఎంలకు కిశోరి వికాసంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివరాం, హెల్త్ సూపర్‌వైజర్లు కుసుమకుమారి, ఆశా బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండల కార్యాలయ సభా భవనంలో కిషోరి వికాసంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ చేరెడ్డి సావిత్రి పాల్గొని మాట్లాడారు. అనంతరం అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.రామచంద్రారెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖాధికారి, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని అన్ని శాఖల సమష్టి కృషితోనే కిశోరి వికాసం సాధ్యమవుతుందని మండల అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి అధికారి చంద్రమౌలీశ్వర్ అధ్యక్షతన కిశోరి వికాసంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి చంద్రమౌలీశ్వర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, ఈఓపీఆర్డీ, పులిరామ్‌సింగ్, మండల విద్యాశాఖాధికారి జాఫర్‌సాధిక్ తదితరులు పాల్గొన్నారు.